కిరణ్ టైప్ ఇన్స్టిట్యూట్

శ్రీ ఉమా మహేశ్వర స్తోత్రమ్

శ్రీరస్తు

- భావార్థముతో -

శుభమస్తు



అవిఘ్నమస్తు

సేకరణ: కిరణ్ టైప్ ఇనిస్టిట్యూట్, 41-1/8-13A.,
గౌతమీనగర్,3వ లైను, కృష్ణలంక, విజయవాడ-520 013.
https://madhirafamily.wordpress.com/

కిరణ్ టైప్ ఇన్‌స్టిట్యూట్



శ్రీ ఉమామహేశ్వర స్తోత్రమ్

01. నమః శివాభ్యం నవయౌవనాభ్యాం
పరస్పరాశ్లిష్ట వపుర్ధ రాభ్యామ్।
నగేంద్రకన్యా వృష కేతనాభ్యాం
నమో నమః శ్శంకర పార్వతీభ్యామ్॥

నిరంతర యవ్వనులై, పరస్పర ప్రేమాసక్తులైన పర్వతరాజ పుత్రి, వృషభధ్వజులైన ఉమా మహేశ్వరులకు ప్రణమిల్లుతున్నాను.

మంగళమూర్తులు, నవయౌవనవంతులు, పరస్పరము గాఢంగా పెనవేసుకున్న శరీరములు కలవారు, హిమవంతుని కుమార్తె – జెండాపై వృషభ చిహ్నము కలవారు అగు పార్వతీ పరమేశ్వరులకు నమస్కారము.

02. నమః శివాభ్యాం సరసోత్సవాభ్యాం
నమస్కృతాభీష్ట వరప్రదాభ్యామ్।
నారాయణేనార్చిత పాదుకాభ్యామ్
నమో నమః శంకరపార్వతీభ్యామ్॥

ఎవరి ప్రేమ అనంతమైనదో, ఎవరు తమను స్మరించినవారికి అన్నివరములను ప్రసాదిస్తారో, ఎవరి పాద పద్మములు నారాయణునిచే అర్చించబడునో, అటువంటి ఉమా మహేశ్వరులకు ప్రణమిల్లుతున్నాను.

మంగళమూర్తులు, సరసస్వరూపులు, భక్తులు కోరు వరములిచ్చు వారు, నారాయణుని చేత పూజింపబడు పాదుకలు కలవారు అగు పార్వతీ పరమేశ్వరులకు నమస్కారము.

03. నమః శివాభ్యాం వృషవాహనాభ్యాం
విరించి విష్ణ్వింద్ర సుపూజితాభ్యామ్।
విభూతిపాటీర విలేపనాభ్యాం
నమో నమః శంకరపార్వతీభ్యామ్॥

వృషభారూఢులై, బ్రహ్మ విష్ణు ఇంద్రాదులచే స్తుతించబడినవారై, గంధము, విభూతిచే పరిమళభూతమైన శరీరములు కలవారైన ఉమా మహేశ్వరులకు ప్రణమిల్లుతున్నాను.

మంగళమూర్తులు, జెండాపై ఎద్దు చిహ్నము కలవారు, బ్రహ్మ – విష్ణువు – ఇంద్రుడు మొదలగు వారిచే పూజింప బడువారు, విభూతి – చందనము పూసుకున్నవారు అగు పార్వతీ పరమేశ్వరులకు నమస్కారము.

04. నమః శివాభ్యాం జగదీశ్వరాభ్యాం
జగత్పతిభ్యాం జయవిగ్రహాభ్యామ్।
జంభారిముఖ్యై రభివందితాభ్యాం
నమో నమః శంకరపార్వతీభ్యామ్॥

సమస్త విశ్వమునకు అధిదేవతలై, విశ్వ విజేతలై, ఇంద్రాది సమస్త దేవతలచే స్తుతించబడుతున్న ఉమా మహేశ్వరులకు ప్రణమిల్లుతున్నాను.

మంగళమూర్తులు, జగత్తును పాలించువారు, ప్రపంచమునకు ప్రభువులు, విజయస్వరూపులు, ఇంద్రుడు మొదలగు దేవతలచే పూజింపబడువారు, అగు పార్వతీ పరమేశ్వరులకు నమస్కారము.

05. నమః శివాభ్యాం పరమౌషధాభ్యాం
పంచాక్షరీపంజర రంజితాభ్యామ్।

ప్రపంచ సృష్టిస్థితి సంహృతాభ్యాం
నమో నమః శంకర పార్వతీభ్యామ్॥

ఔషధ స్వరూపులై సకల రోగములను నివారిస్తూ, పంచాక్షరిని పారాయణ చేసేవారిని కరుణిస్తూ, విశ్వమును సృష్టించి, పాలించి లయము చేసే ఉమా మహేశ్వరులకు ప్రణమిల్లుతున్నాను.

మంగళమూర్తులు, సర్వరోగములను పోగొట్టు ఔషదములు, పంచాక్షరీ మంత్రమను పంజరము నందు విరాజిల్లుచున్న వారు, ప్రపంచము యొక్క సృష్టి–స్థితి–లయలకు కారణమైనవారు, అగు పార్వతీ పరమేశ్వరులకు నమస్కారము.

06. నమః శివాభ్యామతిసుందరాభ్యాం
అత్యంతమాసక్తహృదంబుజాభ్యామ్।
అశేషలోకైక హితంకరాభ్యాం
నమో నమః శంకర పార్వతీభ్యామ్॥

తమ భక్తుల హృదయ పద్మములలో వసించువారు, ప్రపంచము యొక్క సంక్షేమమే దృష్టిగా కలవారు అయిన ఉమా మహేశ్వరులకు ప్రణమిల్లుతున్నాను.

మంగళమూర్తులు, అతి సుందరులు, మిక్కిలిగా పెనవేసుకున్న హృదయములు కలవారు, సమస్త లోకములకు మంచి చేయువారు, అగు పార్వతీ పరమేశ్వరులకు నమస్కారము.

07. నమః శివాభ్యాం కలినాశనాభ్యాం
కంకాళ కల్యాణ వపుర్ధరాభ్యామ్।
కైలాస శైలస్థిత దేవతాభ్యాం
నమో నమః శంకర పార్వతీభ్యామ్॥

కలి దోషములను నివారించి, కంకాళములతో కూడిన శరీరమొకవైపు, సుకుమారమైన శరీరమొకవైపు కలిగి, కైలాస పర్వతంపై నివసించే ఉమా మహేశ్వరులకు ప్రణమిల్లుతున్నాను.

మంగళమూర్తులు, కలికాల దోషములను నాశనం చేయువారు, ఎముకల నొకరు – శుభకరమగు దేహము నొకరు ధరించిన వారు, కైలాస పర్వతము నందున్న దేవతలు అగు పార్వతీ పరమేశ్వరులకు నమస్కారము.

08. నమః శివాభ్యామశుభాపహాభ్యాం
అశేషలోకైక విశేషితాభ్యామ్
అకుంఠితాభ్యాం స్మృతిసంభృతాభ్యాం
నమో నమః శంకర పార్వతీభ్యామ్॥

దుష్ట శక్తులను సంహరించి, ఈ విశ్వములో ఏక స్వరూపులై, భక్తుల ప్రార్థనలను ఏమరక ఆలకించే ఉమా మహేశ్వరులకు ప్రణమిల్లుతున్నాను.

మంగళమూర్తులు, అశుభములను పోగొట్టువారు సమస్తలోకము లందు ఒకే ఒక గొప్పవారుగా ప్రశంసించబడు వారు, ఆటంకములు లేనివారు, స్మృతి స్వరూపులు అగు పార్వతీ పరమేశ్వరులకు నమస్కారము.

09. నమః శివాభ్యాం రథవాహనాభ్యాం
రవీందువైశ్వానరలోచనాభ్యామ్
రాకాశశాంకాభ ముఖాంబుజాభ్యాం
నమో నమః శంకర పార్వతీభ్యామ్॥

శరణు వేడినవారిని కరుణించి, సూర్య చంద్ర అగ్నులను మూడు నేత్రములుగా కలిగినవారు, ఆకాశములో పూర్ణ చంద్ర బింబమువలే దృష్టిగోచరమయ్యే పాదపద్మములు కలిగిన ఉమా మహేశ్వరులకు ప్రణమిల్లుతున్నాను.

మంగళమూర్తులు, రథవాహనమందున్నవారు, సూర్యుడు - చంద్రుడు - అగ్ని కన్నులుగా కలవారు, పున్నమి చంద్రుడు వంటి ముఖపద్మములున్నవారు అగు పార్వతీ పరమేశ్వరులకు నమస్కారము.

10. నమః శివాభ్యాం జటిలంధరాభ్యాం
జరామృతిభ్యాం చ వివర్జితాభ్యామ్।
జనార్ధనాబ్జోద్భవపూజితాభ్యాం
నమో నమః శంకర పార్వతీభ్యామ్॥

సకల ప్రాణులను అయస్కాంతమువలె తమవైపు ఆకర్షించుకుంటూ - జననము, వృద్ధాప్యము, మరణము లేనివారు, బ్రహ్మ, విష్ణువు మొదలైన దేవతలచే అర్చించబడే ఉమా మహేశ్వరులకు ప్రణమిల్లుతున్నాను.

మంగళమూర్తులు, జటలు ధరించిన వారు, ముసలితనము - మరణము లేనివారు, విష్ణువు - బ్రహ్మలచే పూజింపబడు వారు అగు పార్వతీ పరమేశ్వరులకు నమస్కారము.

11. నమః శివాభ్యాం విషమేక్షణాభ్యాం
బిల్వచ్ఛదామల్లికదామభృద్భ్యామ్।
శోభావతీ శాంత వతీశ్వరాభ్యాం
నమో నమః శంకర పార్వతీభ్యామ్॥

కష్ట కాలములో అందరికి దిక్కు అయినవారు, బిల్వ దళములు, మల్లె పూల మాలలను ధరించినవారు, నిరంతర శాంతి స్వరూపులు అయిన ఉమా మహేశ్వరులకు ప్రణమిల్లుతున్నాను.

మంగళమూర్తులు, మూడు కన్నులు కలవారు, మారేడు దళముల దండ - మల్లెపూల దండలను ధరించువారు, శోభావతీ - శాంతవతీశ్వరులను పేర్లు కలవారు అగు పార్వతీ పరమేశ్వరులకు నమస్కారము.

12. నమః శివాభ్యాం పశుపాలకాభ్యాం
జగత్త్రయీరక్షణబద్ధహృద్భ్యామ్।
సమస్త దేవాసుర పూజితాభ్యాం
నమో నమః శంకర పార్వతీభ్యామ్॥

ఈ విశ్వములోని అన్ని ప్రాణులకు రక్షకులు, త్రిలోకములను కాచువారు, దేవతలచేత అసురులచేత కూడా ఆరాధించబడే ఉమా మహేశ్వరులకు ప్రణమిల్లుతున్నాను.

మంగళమూర్తులు, ప్రాణులను పాలించువారు, మూడు లోకములను రక్షించుటలో బద్ధచిత్తులైనవారు, సమస్త దేవతలచే - రాక్షసులచే పూజింపబడువారు అగు పార్వతీ పరమేశ్వరులకు నమస్కారము.

... ఫలశృతి ...

13. స్తోత్రం త్రిసంధ్యం శివపార్వతీభ్యాం
భక్త్యా పఠేద్ద్వాదశకం నరో యః।
స సర్వసౌభాగ్యఫలాని భుంక్తే
శతాయురాంతే శివలోకమేతి॥

ప్రభాత సమయములోనూ, మధ్యాహ్న సమయంలోనూ, ప్రదోష సమయంలోనూ ఈ ఉమా మహేశ్వర స్తోత్రాన్ని నిత్యం పఠించే వారు, సర్వ సౌభాగ్యములు పొంది, కష్టములు లేని, ప్రశాంతమైన ఆనందకరమైన జీవితాన్ని గడిపిన అనంతరం శివలోకాన్ని పొందుతారు.


పన్నెండు శ్లోకములు కల ఈ స్తోత్రమును పార్వతీ పరమేశ్వరుల కొరకై ఎవడు మూడు కాలము లందు భక్తితో పఠించునో వాడు సర్వ సౌభాగ్యములను అనుభవించును. నూరేళ్లు జీవించి పిదప శివలోకమును చేరును.

- - - ఇతి శ్రీ శంకరాచార్య విరచిత శ్రీ ఉమా మహేశ్వర స్తోత్రమ్ సంపూర్ణమ్ ---



కిరణ్ టైప్ ఇన్స్టిట్యూట్





Kiron Type Institute